క్లుప్తంగా

నియామకం



నియామకపత్రం అందిస్తున్న శ్రీనివాస్

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన నేరెళ్ల మారుతిగౌడ్‌ను రామడుగు మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా నియామకం చేస్తూ మంగళవారం జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ సీమ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, నాయకులు తాటిపల్లి జంపన్న, సాగర్, చంద్రమౌళి, మల్లేశం, ప్రభాకర్, సదానందం పాల్గొన్నారు. తన నియామకానికి కృషి చేసినవారికి మారుతిగౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గంగాధర అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

గంగాధర: తెలంగాణ ఉద్యమకారులు ఫోరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఉద్యమకారుల జిల్లా ఫోరం మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా గంగాధర మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పొన్నాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమకారుల న్యాయం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

నవోదయలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే చొప్పదండి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. 8 నుంచి 12 తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, వైద్యులు సురేశ్, ప్రతిభ, స్టాఫ్‌నర్సు ప్రమీల, రాజశేఖర్, సారిక, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంపై కృతజ్ఞతలు

చొప్పదండి: ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు ఎమ్మెల్యే సత్యం మొదటి నెల జీతం నుంచి రూ.1.50 లక్షలు విరాళంగా ఇవ్వడం పట్ల మండలంలోని కాట్నపల్లి, చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం ఆవశ్యకతను గుర్తించి ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న వేలం

మానకొండూర్: మండల కేంద్రంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకోడానికి వేలం నిర్వహిస్తునట్లు ఆలయ ఈవో అనిల్‌కుమార్ తెలిపారు. 1/4/2024 నుంచి 31/03/2025 వరకు ఆలయం వద్ద కొబ్బరికాయలు, వాహన, స్వామి వారిపూజా సామగ్రి విక్రయాలకు 12న సీల్డ్ టెండర్, బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకోడానికి లక్ష రూపాయలు, పులిహోర, లడ్డు, అమ్ముకోవడానికి రూ. 50 వేల డిపాటిట్ నిర్ణయించామని పేర్కొన్నారు.

సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

చొప్పదండి: జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను మంగళవారం చొప్పదండి పట్టణంలో నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చొప్పదండి, గుమ్లాపూర్, మానకొండూర్, కరీంనగర్, అన్నారం టీంలకు చెందిన 60 మంది క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి బి. వేణుగోపాల్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ పొందాలని కోరారు. కార్యక్రమంలో రబియా, పీడీ కె. కృష్ణ, ఎం చంద్రశేఖర్, ఆకాశ్, అంజన్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణ

సప్తగిరికాలనీ: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) కొత్తగా ప్రవేశపెట్టిన ఇండెక్స్ ప్లస్ వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్‌ను మంగళవారం కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు ఆవిష్కరించారు. యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం పాలసీ అని, అమలులో ఉన్న కాలం అంతా జీవిత బీమా కవరేజీతో పాటు పొదుపు అవకాశం కూడా కల్పించే పాలసీ అన్నారు. మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌లో సవాలే..

- ఫిబ్రవరిలోనే వేసవిని తలపిస్తోన్న వైనం
- పల్లె ప్రకృతి వనాలపై ఎండల తీవ్రత
- మొన్నటివరకు జీపీల ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహణ
- ఇప్పుడు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులదే బాధ్యత



ఖాసింపేటలో పల్లె ప్రకృతి వనం



చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలు

గన్నేరువరం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. పల్లెలకు కొత్తదనం వచ్చేలా వీటిని నిర్మించారు. వనాల్లో ఆహ్లాదం కోసం, సేదతీరేలా అన్నిరకాల పూలు, పండ్ల మొక్కలతోపాటు నీడనిచ్చే వృక్షాలు, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే మొక్కలను నాటారు. గ్రామాలకు సమీపంలో వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలతో పాటు చిన్నపిల్లలకు ఉపయోగంగా మారాయి. వీటి నిర్వహణకు పెద్ద ఇబ్బందులు లేవు కానీ ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్నాయి. చెట్లు, పూలు, పండ్ల మొక్కలకు నీటిని అందిస్తేనే పచ్చదనం కళకళలాడుతాయి.

గన్నేరువరం మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. హరితహారంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో గ్రామాలు పచ్చదనంతో నిండుకున్నాయి. వీటిని ఈ స్థాయి వరకు తీర్చిదిద్దడంలో గ్రామ పంచాయతీలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బంది కృషి ఉంది. అందుకే మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో 20 గుంటల నుంచి ఎకరం విస్తీర్ణంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాల మధ్యలో చక్కని రహదారులు, వాకింగ్ ట్రాక్‌లు బెంచీలు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులను అందుబాటులోకి తీసుకువచ్చారు. హరితహారం పథకం మొక్కలను అధికారులు గ్రామ పంచాయతీలకు అప్పగించారు. పల్లె ప్రకృతి వనం చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు కమాన్, గేట్‌ను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

వేసవిలో సవాల్

ప్రకృతి వనాలఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ పాలకవర్గాలు నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. మొక్కలు నాటిన ప్పటి నుంచి మూడేళ్ల వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్వహణ ఖర్చు అందించగా అటు తరువాత నుంచి గ్రామ పంచాయతీలు నిర్వహణ బాధ్యతను చూసుకున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఇన్నాళ్లు ప్రకృతి వనాలకు వేసవిలో సైతం ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా కాపాడుకుంటువచ్చారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి ప్రత్యేక అధికారుల పాలనను ప్రభుత్వం తీసుకువచ్చింది. అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులకు సొంతశాఖల పనుల తో పాటు గ్రామ పంచాయతీ బాధ్యతలను సైతం నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత పెరిగింది. దీంతో ప్రకృతి వనాల్లోని పండ్లు, పూల మొక్కలు, ఇతర చెట్లు ఎండిపోకుండా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తూ కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం



ప్రకృతి వనాల్లో ప్రజలకు, పిల్లలకు ఆహ్లాదాన్ని అందించేలా అధికారులు, పాలకవర్గ సభ్యుల సమన్వయంతో తీర్చిదిద్దాం. పల్లె ప్రకృతి వనంలో నీడనిచ్చే చెట్లతో పాటు వివిధ పూలు, పండ్ల మొక్కలు పెంపకం చేపట్టాం. గ్రామంలో సమీపంలో ఉండటంతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం.

– గంప మల్లీశ్వరీ మాజీ సర్పంచ్

ఎండిపోకుండా ఏర్పాట్లు..



ఎండల తీవ్రత పెరుగుతోంది. పల్లె ప్రకృతి వనంలోని చెట్లు, ఇతర పండ్లు, పూల మొక్కలను కాపాడుకోవడానికి జీపీల ద్వారా నీటిని అందించడానికి ఏర్పాట్లు చేస్తాం. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, ఈజీఎస్, జీపీ సిబ్బందితో సమావేశం నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతోంది.

– స్వాతి, ఎంపీడీవో గన్నేరువరం

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన విశ్వాంత్‌రెడ్డి ఇండో–నేపాల్ కరాటే పోటీల్లో పాల్గొన్ని బంగారు పతకం సాధించింది. మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జవ్వాజీ హరీశ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

కరీంనగర్: తెలంగాణ ప్రొగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జూబ్లీనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అందరికీ సమాన విద్య, అంతరాలు లేని కామన్ స్కూల్ విధానం అందజేసినప్పుడే రాజ్యాంగ లక్ష్యాలైన సమసమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, మేధావులు, విద్యావంతులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు రామస్వామి, జలజదేవి, చంద్రమౌళి, మమత, ఆంజనేయులు, అసిఫ్‌లీ, ఉదయభాను, జీనత్‌బేగం, గోపికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘భూ కబ్జాల్లో గంగుల కమలాకర్‌కు హస్తం’



మాట్లాడుతున్న బేతి మహేందర్‌రెడ్డి

విద్యానగర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు భూ కబ్జాల్లో హస్తముందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూ మాఫియాకు పాల్పడ్డ వారికి వంత పాడుతూ తనే సూత్రదారి, పాత్రదారి పాత్ర పోషించాడని, దీనికి సజీవ సాక్ష్యమే భూ కబ్జాల ఆరోపణలతో జైల్‌లో ఉన్న నిందులతో గంగుల కమలాకర్ ములాఖత్ కావడమే అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపాడ్, సదాశివపల్లి, నుస్తులాపూర్‌లతో పాటు కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్, కొత్తపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్, సీలింగ్ భూములతో పాటు ఎస్సారెస్పీ భూములను పరిరక్షించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా మాజీ కార్యదర్శి భగవాన్, మాజీ నగర ఉపాధ్యక్షుడు సుమన్, బీజేపీ నాయకులు నరహరి, లక్ష్మణ్, రాంరెడ్డి, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: విద్యార్థుల నృత్యాలు.. కేరింతలతో వాగేశ్వరి డిగ్రీ, పీజీ ఉమెన్స్ కళాశాల ఫ్రెషర్స్ డే ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. నగరశివారులోని ఎస్వీఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.శ్రీరంగప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్యసాధన దిశగా కష్టపడాలని సూచించారు. వాగేశ్వరి విద్యాసంస్థల అధినేత బి.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు డాక్టర్లు, లాయర్లు, శాస్త్రవేత్తలు, జడ్జీలు ఇలా పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ కళాశాలకు కీర్తి తీసుకవచ్చారని కొనియాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు అధైర్య పడొద్దు

హుజూరాబాద్: దళితబంధు లబ్ధిదారులు అధైర్యపడొద్దని త్వరలో రెండో విడత డబ్బులు మంజూరు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

21 వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష రుసుము చెల్లింపు గడువు

సప్తగిరికాలనీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్ష రుసుము ఈనెల 12 నుంచి 21వరకు చెల్లించవచ్చని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ ఎ.శంకరయ్య తెలిపారు. టెన్త్ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలని అన్నారు. గతంలో ఉత్తీర్ణులు కానీ వారు కూడా పరీక్షా ఫీజు చెల్లించి ఏప్రిల్‌లో జరిగే వార్షిక పరీక్షలు వ్రాయవచ్చునని తెలిపారు. రూ.25 అపరాధ రుసుముతో ఈ నెల 27 వరకు, రూ.50 అపరాధ రుసుంతో మార్చి 4 వరకు చెల్లించవచ్చునని తెలిపారు. పరీక్ష ఫీజు మీ సేవ కేంద్రం, తెలంగాణ స్టేట్ ఆన్‌లైన్ సెంటర్ లేదా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కు చెల్లించగలరని పూర్తి వివరాలకు 9849114956 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

భూ కబ్జాకు యత్నించిన పలువురిపై కేసు

కరీంనగర్‌క్రైం: నగర శివారులోని తీగలగుట్టపల్లిలో భూమి కబ్జా చేసేందుకు యత్నించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. వివేకానందపురికాలనీకి చెందిన అనుమండ్ల రవీందర్ తీగలగుట్టపల్లిలోని తన భూమిలో ఇంటి నిర్మాణానికి మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి పొందాడు. అయితే ఆ భూమిని కబ్జా చేసేందుకు యత్నించడంతో పాటు అందులో చేస్తున్న నిర్మాణాన్ని తోట శ్రీపతిరావు తన అనుచరులతో కలిసి కూల్చివేశాడని రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో శ్రీపతిరావుతోపాటు పలువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలిసిన శ్రీపతిరావు హైదరాబాద్‌కు పరారీ కావడంతో పట్టుకొని అరెస్టు చేశామన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన

సాక్షి నెట్‌వర్క్: సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సుమన్ క్షమాపణ చెప్పాలని, పోలీసులు ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అధికారం కోల్పోయిన అక్కసుతో సీఎంను దూషించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితబంధు అమల్లో బీఆర్‌ఎస్ విఫలం



మాట్లాడుతున్న రాచపల్లి సాగర్

జమ్మికుంట: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన జాప్యంతో రెండో విడుత దళితబంధు ఆలస్యమైందని తెలంగాణ అంబేద్కర్ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎన్నికలకు రెండు నెలల కాలం సమయం ఉన్నప్పటికీ లబ్ధిదారులకు దళితబంధు అందించడంలో విఫలమైందన్నారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండో విడుత డబ్బులు మంజూరయ్యేలా దళితుల పక్షాన పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అరుణ్, దళితసంఘం నాయకులు చంద్రగిరి రజినీకాంత్, కొలుమూరి రవీందర్, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై

జమ్మికుంట: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి శ్రీకాంత్ ఇసుక అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నామని, ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఎస్‌ఐ రాజేశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఏడుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచుల ఆందోళన



ఎంపీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులు

గంగాధర: తాము పదవిలో ఉండగా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తాజా మాజీ సర్పంచులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మా పదవికాలంలో మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వకుండా అధికార యంత్రాంగం ఆపారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని బకాయిలు చెల్లించకుంటే మాకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఈమేరకు ఎంపీవోకు వినతిపత్రం అందజేశారు.

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మంగళవారం వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఘన్ముకుల మోడల్ స్కూల్ కళాశాలలోని విద్యార్థులకు అధ్యాపకులతో కలిసి కరప్రతాలు పంచుతూ అవగాహన కల్పించారు. అన్ని వసతులు, ఉన్నత విద్యనభ్యసించిన అధ్యాపకులు ఉన్నారని, భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవడానికి డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. టీఎస్‌కేసీ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. డిగ్రీకి సంబంధించిన అన్నిరకాల కోర్సులు అందుబాటులో ఉన్నయని, దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామ్మోహన్‌రావు, రేణ, ఈశ్వరయ్య, స్వరూపరాణి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్ మొక్కల పెంపకం

గోపాల్‌పూర్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభం

కరీంనగర్‌రూరల్: అధిక లాభాలను ఆర్జించే డ్రాగన్‌ఫ్రూట్ మొక్కల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఇద్దరు, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి గ్రామాల్లో ఒక్కో రైతు మొక్కల పెంపకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం తొలిసారి ప్రయోగాత్మకంగా గోపాల్‌పూర్‌లో రైతులు ఊరడి తిరుపతి, హన్మాండ్ల వేణు చెరో 20 గుంటల చొప్పున మొత్తం 40గుంటల విస్తీర్ణంలో డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎన్.దివ్యదర్శన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రామడుగులోని నర్సరీ నుంచి ఒక్కో మొక్కకు రూ.40 చొప్పున చెల్లించి మొత్తం 950 మొక్కలు తీసుకొచ్చారు. పందిరిసాగు, డ్రిప్ ఇరిగేషన్ విధానంలో ఈ మొక్కలు పెంచేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉపాధిహామీ నుంచి రైతులకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రతినెలా చెల్లిస్తారు. మొదటి దశలో ప్రయోగాత్మకంగా గోపాల్‌పూర్‌లో డ్రాగన్‌ఫ్రూట్ మొక్కల పెంపకాన్ని ప్రారంభించామని, త్వరలో మిగితా గ్రామాల్లో కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఈజీఎస్ ఏపీవో శోభరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ, ఈజీఎస్ టీఏ రమ, పలువురు రైతులు పాల్గొన్నారు.